క్లుప్తంగా

యోగాలో సత్తా చాటిన నరేంద్రనాథ్


అభినందిస్తున్న డైరెక్టర్లు, ఉపాధ్యాయులు

జూలూరుపాడు: గత ఆగస్టులో కొత్తగూడెంలో జరిగిన నేషనల్ లెవల్ ఓపెన్ యోగా చాంపియన్ షిప్‌లో జూలూరుపాడు సాయి ఎక్సలెంట్ స్కూల్ విద్యార్థి సోడె నరేంద్రనాథ్ భగవత్ జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి సాధించాడు. గురువారం భగవత్‌ను స్కూల్ డైరెక్టర్లు గోలి వీరభద్రం, సుజాత, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పార్క్‌లో ఈత కొలను నిర్మాణం

ఇల్లెందు: పట్టణంలోని చెరువు కట్ట ఏరియాలోని లేక్ వ్యూ పార్క్‌లో ఈత కొలను నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావులతో కలిసి పంచాయతీ రాజ్‌శాఖ ఈఈ శ్రీనివాస్‌రావు, డీఈ రాంకిషన్ సందర్శించి పరిశీలించారు. గురువారం కొలను బెడ్ నిర్మాణ పనులను పరిశీలించి ఏఈ రాజుకు పలు సలహాలు, సూచనలు చేశారు. రూ. కోటితో నిర్మాణం అవుతున్న ఈ కొలను చుట్టూ ఫెన్సింగ్, గేట్‌కు తాళం, ఈత శిక్షణతో పాటు రక్షణ కవచాలు ఉంటాయని ఈఈ తెలిపారు.

సామాజిక గ్రామసభలు

జూలూరుపాడు: మండలంలో గుండెపుడి, కాకర్ల, జూలూరుపాడు గ్రామాల్లో గురువారం సామాజిక తనిఖీ గ్రామసభలు జరిగాయి. 2023–2024 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పథకం చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి పనుల్లో జరిగిన లోపాలను గుర్తించిన సామాజిక తనిఖీ బృందం సభ్యులు సభలో చదివి వినిపించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

జూలూరుపాడు: భేతాళపాడు గ్రామ పంచాయతీ చీపురుగూడెంలో గురువారం ఏపీజీవీబీ జూలూరుపాడు బ్రాంచి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. మేనేజర్ సురేష్ మాట్లాడుతూ.. బ్యాంకు రుణాలు, సామాజిక భద్రత పథకాలు, ఎస్‌బీఐ జనరల్, ఇన్సూరెన్స్ పథకాలు, డిజిటల్ సేవలు గురించి వివరించారు. సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. బుర్రకథ కళాజాత బృందం విజయ్, ప్రతాప్, ప్రేమ్ కుమార్‌లు ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకు లావాదేవీలు, బ్యాంకు సేవలు, పథకాలు, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత, పచదనం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పోలియో నివారణకు కృషి చేయండి..


మాట్లాడుతున్న చలపతిరావు

కొత్తగూడెంఅర్బన్: పోలియోను నివారించేందుకు సమాజంలో ప్రతీఒక్కరు కృషి చేయాలని కొత్తగూడెంలోని ప్రియదర్శిని డిగ్రీ, పీజీ కళాశాల డైరెక్టర్ శ్రీరామనేని చలపతిరావు అన్నారు. గురువారం కళాశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజంలో ఈ వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షురాలు పి.సుజాత, ఉపాధ్యక్షులు ఉషారాణి, కోశాధికారి సావిత్రి, సిరిమల్ల సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యాషన్ డిజైనింగ్ సెంటర్ ప్రారంభం

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో జగదాంబ ఫ్యాషన్ డిజైనింగ్ సెంటర్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సెంటర్‌లో కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్స్ చేస్తామని నిర్వాహకురాలు నాగమణి పేర్కొన్నారు. కొదుమూరి కోటేశ్వరరావు, వేల్పుల నరసింహారావు, బానోత్ చందా నాయక్, పోతురాజు నాగరాజు, మద్దిశెట్టి వంశీ, భూక్యా అమృ, తిరుపతిరావు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం

ఇల్లెందురూరల్: చెన్నంగలగడ్డ ఆశ్రమ పాఠశాల అభివృద్ధికి వ్యాయామ ఉపాధ్యాయుడు టి.వీరాంజి రూ.20,016 చెక్కును గురువారం హెచ్‌ఎం బి.నామకు అందజేశారు. వీరాంజి స్ఫూర్తితో ఉపాధ్యాయులు నాగరాజు, జైపాల్, సాంబశివరావ, వెంకటేశ్వర్లు, శారద, విద్యారాణి, సుమతి, బాయమ్మ, వీరబాబు, మూర్తి, చంద్రయ్య, శంకర్, చంద్రు, బి.కిషన్ తదితరులు పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా విరాళాన్ని అందజేశారు.

నాణ్యత లోపిస్తే చర్యలు

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన


పాల్వంచ: అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ: అభివృద్ధి పనులను అధికారులు నిత్యం పర్యవేక్షించాలని, కాంట్రాక్టర్లు నాణ్యత లేకుండా పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని చిన్న బంగారుజాల, శ్రీనివాస కాలనీ, ఇందిరాకాలనీ, వనమా కాలనీ, కాంట్రాక్టర్స్ కాలనీల్లో రూ.2.28 కోట్లతో పలు సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. మాట్లాడుతూ.. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు కార్పొరేషన్ చేయాలనే సంకల్పంతో ఉన్నామని, తద్వారా జిల్లా కేంద్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు.

పది నెలల కాలంలో అనేక ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించడం జరిగిందని, రూ.450 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డుకు కృషి చేసినట్లు చెప్పారు. స్లమ్ ఏరియాల్లో పర్యటించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాకూ నాయక్, తహసీల్దార్ వివేక్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, అడుసుమల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, పద్మజ, నాగ సీతారాములు, నూకల రంగారావు, కనగాల అనంతరాములు, ఎలమర్తి అప్పారావు, రవి, నరేందర్, నిమ్మల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

చుంచుపల్లి: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి జరుగుతోందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండలం నంద తండా గ్రామపంచాయతీ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో రూ.33 లక్షల ఏడీపీ నిధులతో నందతండా బృందావనం గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిర్మించనున్న వాటర్ ట్యాంకు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ... తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న గ్రామాలను, బస్తీలను గుర్తించామని, త్వరలో పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరిస్తామన్నారు. పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలతో పాటు గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఉన్న మేజర్, మినీ నీటి పథకాలను పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని, వినియోగంలో లేని పథకాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సింగరేణి కార్మిక వాడల్లో యాజమాన్యం నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్‌పాషా, అన్నవరపు కనకయ్య ఎంపీడీఓ అశోక్ కుమార్, తహసీల్దార్ కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

వేతనాల పెంపునకు ఉద్యమించాలి


మాట్లాడుతున్న సతీష్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపునకు ఉద్యమించాలని, ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌లను కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వాలని టీయూసీఐ రీజియన్ కార్యదర్శి పెద్దబోయిన సతీష్ అన్నారు. గురువారం కొత్తగూడెం కార్పొరేట్‌లోని బంగ్లోస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గత టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల్లో పర్మనెంట్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచకుండా కార్మికుల శ్రమను దోచుకుందన్నారు. సింగరేణిలో ఏళ్ల తరబడి ఉత్పత్తి, ఉత్పాదకతలో రెక్కలు ముక్కలు చేసుకొని 56 విభాగాలలో విధులు నిర్వహిస్తున్నారని, అయినా వేతనాలు పెంచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. శాసనసభలో స్వపక్ష, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు నిలదీస్తే సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు లేరని అబద్దాలు చెప్పడం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే చెల్లిందన్నారు. ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి కాంట్రాక్ట్ కార్మికులకు అనేక హామీలు ఇచ్చారని వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వార్షిక లాభాలలో కార్మికులకు రూ.5 వేలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. 2013 నుంచి కోలిండియాలో హైపవర్ వేతనాలు చెల్లిస్తున్నారని సింగరేణిలో మాత్రం అప్పటి చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వం మొండికేసినట్లు పేర్కొన్నారు. జీఓ నంబర్ 22ను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ చేయాలని, కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు రాష్ట్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్, నాగమ్మ, మణెమ్మ, ఆస్లీ, కాంతి, ఉమేష్, రోజా, మల్లేష్, శారద, మంగమ్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి


రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ సుకృత

ఇల్లెందురూరల్: ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంపునకు కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుకృత సూచించారు. కొమరారం పీహెచ్‌సీని గురువారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలో వివిధ విభాగాలను సందర్శించి పనితీరును పరిశీలించారు. రోజువారీ ఓపీ వివరాలను రికార్డుల ఆధారంగా తనిఖీ చేశారు. మందుల నిల్వ గదిని సందర్శించి నిల్వ ఉన్న మందుల వివరాలను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి సిబ్బందితో సమావేశం నిర్వహించి గర్భిణులకు మెరుగైన సేవలు అందిస్తూ ఆస్పత్రిలోనే ప్రసవం పొందేలా ప్రోత్సహించాలని చెప్పారు.

గ్రామాలలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం చేస్తూ అవసరమైన చోట్ల వైద్యశిబిరాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ లోహిత, డాక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

మద్యం సిండికేట్‌పై చర్యలు తీసుకోండి..

ఇల్లెందురూరల్: మద్యం సిండికేట్ వ్యాపారులపై చర్య తీసుకోవాలని కోరుతూ సేవాలాల్ సేన ఆధ్వర్యంలో గురువారం ఇల్లెందు ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సేన జిల్లా అధ్యక్షుడు సురేష్‌నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవిరాథోడ్, రాష్ట్ర కార్యదర్శి భూక్యా శ్రీను మాట్లాడుతూ.. ఇల్లెందు ఎక్సైజ్ శాఖ పరిధిలోని మండలాల్లో నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఈ కారణంగా రోజంతా పనిచేసి సాయంత్రం మద్యం తీసుకునే వారి జేబులు గుల్ల చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎక్సైజ్ అధికారులు స్పందించి బెల్ట్‌షాపులను అరికట్టాలని కోరారు. లావుడ్యా సురేష్‌నాయక్, బానోత్ నాగరాజు, రమేష్‌నాయక్, రాంబాబు, రమేష్ పాల్గొన్నారు.

అయోడైజ్డ్ ఉప్పునే వాడండి..


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దినేష్

టేకులపల్లి: అయోడైజ్డ్ ఉన్న ఉప్పుని వాడటం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, అయోడిన్ లోపం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని టేకులపల్లి వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. గురువారం మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అయోడైజ్డ్‌పై అవగాహన సదస్సు, వైద్యశిబిరం నిర్వహించారు. మాట్లాడుతూ... సంపూర్ణ ఆరోగ్యం కావాలంటే మానవ శరీరానికి సూక్ష్మపోషకం అయిన అయోడిన్ ఎంతో ముఖ్యమని తెలిపారు. అయోడిన్ లోపం వల్ల థైరాయిడ్ గ్రంధి పనిచేయక శరీరంలో జీవక్రియలు తగ్గిపోయి బరువు పెరుగుతారని పేర్కొన్నారు. అలాగే గర్భధారణ సమస్యలు, బలహీనత, అలసట, జుట్టు ఊడిపోవడం, చర్మం పొడి బారిపోవడం, పిల్లల్లో వయసుకు తగ్గ చురుకుదనం లేకపోవడం, పెరుగుదల లోపం, జ్ఞాపకశక్తి తగ్గడం, చదువులో ఆటల్లో ప్రతిభ చూపలేకపోవడం, పుట్టుకతో చెవుడు, మూగతనం, మరుగుజ్జుతనం, కండరాలు బిగుసుకుపోవడం వంటి ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున భారత ప్రభుత్వం అయోడైజ్డ్ చేర్చిన ఉప్పుని మాత్రమే అమ్మాలని ఆదేశించిందని తెలిపారు. పిల్లలకు ఉప్పులో అయోడిన్ ఉందా లేదా తెలుసుకోవడానికి ఎలా పరీక్షించాలో ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నిశాంత్ కృష్ణవా, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, సూపర్‌వైజర్ నాగబండి వెంకటేశ్వర్లు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ ధరణి, ఆరోగ్య సహాయకురాలు స్వప్న, స్టాఫ్ నర్స్ భవాని, రమేష్‌బాబు పాల్గొన్నారు.

'కాంట్రాక్ట్' సమస్యలపై నేడు చర్చ


మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై చర్చించేందుకు ఈనెల 25న కొత్తగూడెంలోని ఆర్‌సీఓ క్లబ్‌లో జరగనున్న సమావేశానికి తెలంగాణ ఉద్యమనేత, ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం రానున్నారని కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు తెలిపారు. గురువారం రుద్రంపూర్‌లో కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఇటీవల సింగరేణి చైర్మన్, కోదండరాం కలిసి సమస్యలను వివరించినట్లు తెలిపారు. ఈ సమావేశానికి కాంట్రాక్ట్ కార్మికులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గెస్ట్ టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఇల్లెందు: ఇల్లెందులోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో రెండు గెస్ట్ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బి.కృష్ణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. టీజీటీ ఇంగ్లిష్–1, టీజీటీ– సోషల్ స్టడీస్–1 ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బీఈడీ లేదా టేట్ అర్హత కలిగి 18 నుంచి 44 ఏళ్ల లోపు ఉండాలని పేర్కొన్నారు. ధ్రువపత్రాలతో ఈనెల 28 లోపు కళాశాలలో దరఖాస్తులను అందజేయాలని, వివరాలకు 9515523864, 9110360408 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

దివ్యాంగుల పెన్షన్లు పెంచండి..

జూలూరుపాడు: దివ్యాంగులకు పెన్షన్ పెంచాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బుట్టి నరేష్ అన్నారు. గురువారం ఆయన జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్ పెంపు కోసం వచ్చే నెల 26న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పదేళ్లుగా అనేక మంది దివ్యాంగులు కొత్త పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారని, తక్షణమే పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దామెర్ల సర్వేష్, కూరాకుల నరసింహారావు, జాటోత్ సునీత, కుక్కల రాజేష్, రవి పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి


జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): జనరల్ మజ్దూర్లకు పంపు ఆపరేటర్ ప్రమోషన్ కల్పించాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేం రాజుకు సీఐటీయూ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... రుద్రంపూర్ సివిల్ డిపార్ట్‌మెంట్‌లో గైడ్‌లైన్ ప్రకారం జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్నవారు పంప్ ఆపరేటర్ యాక్టింగ్ చేసే వారికి ప్రమోషన్ కల్పించాలని కోరారు. వాల్వ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వారికి పంప్ ఆపరేటర్ ఖాళీలలో భర్తీ చేయాలని, జనరల్ మజ్దూర్లకు యాక్టింగ్ చేయాలని కోరారు. స్పందించిన జీఎం ఖాళీలను తెలుసుకొని భర్తీ చేస్తానన్నారు.

నేడు పాదయాత్ర

టేకులపల్లి: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 25న జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న మాల మహా పాదయాత్రను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు కర్లపూడి సుందర్ కోరారు. గురువారం సులానగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఈ పాదయాత్ర 25న భద్రాచలంలో ప్రారంభమై 27న టేకులపల్లి మండలం సులానగర్‌లోకి ప్రవేశిస్తుందని మాలలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

గుంతలను పూడ్పించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గేటు వద్ద బురద గుంత విద్యార్థులు, ఉపాధ్యాయులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. ఈ సమస్యపై గురువారం సాక్షిలో 'బురద గుంత కనిపిస్తోందా..'శీర్షికన ప్రత్యేక వార్తా కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. ఎంపీడీఓ, ఎంపీఓ ఆదేశాల మేరకు కార్యదర్శి వి.ప్రశాంత్ సిబ్బందితో ట్రాక్టర్‌లో మట్టి తెప్పించి పూడ్పించారు.

జేకే ఓసీ ఉద్యోగులకు జీఎం అభినందన


ఉద్యోగులతో జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బొగ్గు ఉత్పత్తి కంపెనీలలో ప్రమాదరహిత గనులకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వారు ప్రతీ ఏడాది అందజేసే ఫైవ్‌స్టార్ అత్యుత్తమ గనుల అవార్డు ఈసారి ఇల్లెందు జేకే -5 ఓసీ ఎంపికైనట్లు ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ తెలిపారు. గురువారం ఇల్లెందు జేకే–5 ఓసీలో అభినందన సభ స్థానిక ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణమోహన్ అధ్యక్షతన జరిగింది. జీఎం మాట్లాడుతూ.. ఈ నెల 21న న్యూఢిల్లీలో స్కోప్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన బహుమతి ప్రదానోత్సవం వేడుకలలో కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, సహాయ మంత్రి సతీష్‌చంద్ర దూబేల చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు తెలిపారు. రక్షణలో పోటీతత్వం పెంపొందించుకోవటం కోసం ఈ పోటీలను కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్నట్లు వివరించారు. దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన కొన్ని ఫైవ్ స్టార్ రేటింగ్ గనుల్లో సింగరేణి సంస్థ కూడా నిలవడం, సింగరేణికి రక్షణపై గల నిబద్ధతకు ఈ అవార్డు నిదర్శనం అన్నారు. జేకే ఓసీ ఇదే ఒరవడి కొనసాగిస్తూ భవిష్యత్‌లో కూడా ఉత్పత్తితో పాటు రక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఇతర గనులకు ఆదర్శంగా నిలవాలని ఉద్యోగులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూజీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, అధికారుల సంఘం తరపున చిన్నయ్య, మేనేజర్ పులి పూర్ణచందర్, గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రెటరీ నజీర్ అహ్మద్, ఫిట్ కార్యదర్శులు సంజీవ చారీ, నవీన్ కుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగుతో అధిక లాభాలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి

పాల్వంచరూరల్: మునగ సాగు ద్వారా రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని ఎంపీడీఓ కె.విజయ భాస్కరరెడ్డి అన్నారు. తోగ్గూడెం గ్రామంలో గురువారం మునగ సాగుపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ... మునగ పంట సాగు చేసుకోవడం ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. మునగ సాగుకు ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ ఉపాధి హామీ పథకం కింద గుంతలు తవ్వడం, కూలీల ఖర్చు, మొక్కలకు సపోర్టు కర్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. పంటసాగు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ బి.నారాయణ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, టెక్నికల్ అసిస్టెంట్ సుజాత, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర కల్పించండి..


తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: ఆరుగాలం రైతులు కష్టించి పండించిన అన్నిరకాల పంటలకు తగిన మద్దతు ధర అందించాలని న్యూడెమోక్రసీ అనుబంధ ఏఐకేఎంఎస్ డిమాండ్ చేసింది. గురువారం ఇల్లెందు తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా ఏఐకేఎంఎస్ అధ్యక్షులు ఉప్పరబోయిన రామ్మూర్తి, కార్యదర్శి కొమరం సత్యనారాయణ, ఎన్డీ జిల్లా కార్యదర్శి బానోతు ఊక్లా, కందగట్ల సురేందర్ మాట్లాడుతూ.. కనీస మద్దతు ధరలు లభించిక రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. తుఫానుకు నష్టపోయిన రైతులకు నేటికీ పరిహారం అందించలేదన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో పాపారావు, ఉమ, కిషన్, శ్రీను, రవి, భద్రయ్య, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

కొత్త బస్సులు ఏర్పాటు చేయాలి


బస్టాండ్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఇల్లెందు: కాలం చెల్లిన బస్సులను తొలగించి కొత్త బస్సులను ఏర్పాటు చేయాలని, డిపోలో, బస్టాండ్‌లో సమస్యలను పరిష్కరించాలని గురువారం ఇల్లెందు బస్టాండ్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీపీఎం జిల్లా నాయకులు ఎస్‌ఏ నబీ మాట్లాడుతూ... గత ఏడాది క్రితం బస్సు డిపో ప్రారంభించి నేటి వరకు ఒక్కటంటే ఒక్క కొత్త బస్సు కూడా కేటాయించకపోవడం ఈ డిపో మీద అధికారులకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతోందన్నారు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన ప్రభుత్వం బస్సులు ఏర్పాటు చేయకపోవడం శోచనీయం అన్నారు. డిపో ఏర్పాటు చేసి బంక్ ఏర్పాటు చేయకపోవటం వల్ల డీజిల్ కోసం ఇతర డిపోలకు వెళ్లి నిరీక్షించాల్సి వస్తోందన్నారు. డిపోలో ఉన్న మహిళా ఉద్యోగులకు కనీస సౌకర్యాలు లేవన్నారు. ఇల్లెందు చుట్టుపక్కల గ్రామాలకు భద్రాచలం, విజయవాడ, గోదావరిఖని, హైదరాబాద్ లాంటి దూర ప్రాంతాలకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, కిరణ్, మోహన్‌రావు, లక్ష్మి, రాము, పద్మ, యాకూబ్‌షాషా, హుస్సేన్, వైకుంఠం, జయరాజు, సుజాత, రామ, వరలక్ష్మి, మౌలాలీ, డానియేల్, శ్రీను, వెంకటేశ్వర్లు, రెహమాన్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేయండి..



తహసీల్ వద్ద ధర్నా చేస్తున్న ఎన్డీ నాయకులు

టేకులపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బానోత్ ఊక్లా, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరం సత్యనారాయణ, కందగట్ల సురేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో టేకులపల్లి తహసీల్ వద్ద ధర్నా నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు కనీస మద్దతు ధర రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వాలు రైతే రాజు, రైతే దేశానికి వెన్నెముక అని అంటున్నాయి కానీ, అచరణలో వ్యవసాయ అభివృద్ధికి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి 10 నెలల దాటిందని, 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి విఫలమైందన్నారు. రైతులు రుణమాఫీ కోసం వ్యవసాయ అధికారుల, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న దుస్థితి ఉందని వాపోయారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, భూమి లేని నిరుపేదలకు భూములు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, గొగ్గెల పాపారావు, వీరమల్ల ఉమ, భూక్యా కిషన్, భూక్యా శ్రీను, బట్టు రవి, కల్తి భద్రయ్య, సుభద్ర, అంజమ్మ, శీను, వెంకన్న, బట్టు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రిలో మరమ్మతులు


ఐసీయూ వార్డులో మరమ్మతు పనులు

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని సర్వజన ఆస్పత్రిలోని ఐసీయూ వార్డులు, అత్యవసర విభాగం, ప్రత్యేక రూమ్‌లలోని బాత్‌రూమ్‌లు, పేషంట్‌లు ఎంటువంటి అసౌకర్యానికి అభివృద్ధి పనులు చేస్తున్నారు. ఇందుకు రూ.58 లక్షలు కేటాయించారు. ఆర్‌బీ శాఖ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి.

ఈ ఆస్పత్రికి ప్రతీరోజు 400 నుంచి 600 వరకు ఓపీ ఉంటుంది. 250 పడకలు ఉన్నాయి. ఇందులో గతంలో ఉన్న ఐసీయూ వార్డులో 30 పడకలు ఉన్నాయి. రెండు మెడికల్ వార్డులు కాగా, ఒకటి సర్జికల్ ఐసీయూ వార్డులు ఉన్నాయి. అత్యవసర విభాగంతోపాటు, అప్తామాలిక్ ఆపరేషన్ థియేటర్, అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లకు సైతం రిపేర్లు చేస్తున్నారు. ఈ ఆస్పత్రిలోని సమస్యలు, ప్రిన్సిపల్ రాజకుమార్, సూపరింటెండెంట్ రాధామోహన్‌లు ఎప్పటికప్పుడు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్నారు. స్పందించిన కలెక్టర్ మరమ్మతులకు నిధులు కేటాయించారు. దీంతోపాటు సహారా ఏజెన్సీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యం పనులు చేస్తున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం..



జిల్లా ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాము. ఆస్పత్రిలో ఏ సమస్య వచ్చినా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్నాము. సూపరిటెండెంట్ రాధామోహన్ పర్యవేక్షణలో మరమ్మతు పనులు జరుగుతున్నాయి.

– రాజ్‌కుమార్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్